


## నవంబర్‌లో సీపీఎం జిల్లా మహాసభలు



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్

రాజన్న సిరిసిల్ల (నమస్తే తెలంగాణ)/ కలెక్టరేట్, సెప్టెంబర్ 22: నవంబర్‌లో సీపీఎం జిల్లా మహాసభలు నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం సిరిసిల్లలోని అమృతలాల్‌శుక్లా కార్మిక భవన్‌లో సీపీఎం పార్టీ వెంకంపేట శాఖ మహాసభలు అల్లె రమేశ్ అధ్యక్షతన జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన మూశం రమేశ్ మాట్లాడుతూ, సిరిసిల్లలో పవర్‌లూం కార్మికలకు 8 నెలలుగా ఉపాధి లేకుండా పోయిందని కార్మిక కుటుంబాలు ఆర్థికంగా ఎంతో ఇబ్బందిలో ఉన్నాయని, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెంటనే వీరికి పని కల్పించి ఆదుకోవాలన్నారు. అలాగే వెంకంపేట ఏరియాలో కుక్కల బెడద తీవ్రమైందని మున్సిపల్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని, గాంధీ దవాఖాన వద్ద మురుగునీరు నిలుస్తుందని శుభ్రం చేయించాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారానికి శాశ్వత ప్రాతిపదికన మున్సిపల్ దృష్టి సారించాలన్నారు. ఈ మహాసభల సందర్భంగా సీపీఎం పార్టీ వెంకంపేటశాఖ నూతన కార్యదర్శిగా అన్నల్‌దాస్ గణేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని రమేశ్ వెల్లడించారు. ఈ మహాసభలో వెంకంపేటశాఖ సభ్యుడు అల్లె రమేశ్, కుమ్మరికుంట కిషన్, ఎక్కలదేవి జగదీష్, ఆడెపు సంపత్, కోడం సుధాకర్, బొమ్మెన బాలరాజు, పిస్క లక్ష్మణ్, రాము, కొండ రమేశ్, భీమనాతిని రవి, పోగుల రాజు తదితరులు పాల్గొన్నారు.

## సీఎంను కలిసిన సీఐటీయూ నేతలు



హైదరాబాద్‌లో సీఎంను కలిసి వినతి పత్రం సమర్పిస్తున్న సీఐటీయూ నేతలు

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ) : సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విప్ ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ వీరయ్య, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూకంటి రంగారెడ్డి ఆదివారం హైదరాబాద్‌లోని సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎంను కలిశారు. రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, శ్రీనివాసరావు సమక్షంలో పలు సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. అందుకు సంబంధించి వివరాలను తెలంగాణ వపర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్ పత్రికలకు వెల్లడించారు. సిరిసిల్ల పవర్‌లూం పరిశ్రమకు అదనంగా విధించిన విద్యుత్ చార్జీలను వెంటనే రద్దు చేయాలని, 10హెచ్‌పీల పైన ఉన్నవాటిని కూడా మూడో కేటగిరి నుంచి నాలుగో కేటగిరి కిందకు మార్చి సబ్సిడీ ఇవ్వాలని, కార్మికుడినే యజమాని చేయాలన్న వర్కర్‌టూ ఓనర్ పథకాన్ని అమలు చేయాలని, యారన్ సబ్సిడీ నిధులు విడుదల చేయాలని కోరగా, సానుకూలంగా స్పందించిన సీఎం విద్యుత్ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. తన పరిధిలో ఉన్న సమస్యలన్నింటినీ పరిష్కరించి నేతన్నలకు న్యాయం చేస్తానన్నారు. వస్త్ర పరిశ్రమ సమస్యలు ఏవైనా సరే విప్ ఆది శ్రీనివాస్, సీఐటీయూ నాయకులు చెరుపల్లి సీతారాములు ఇద్దరు కలిసి చర్చించి నివేదికలు ఇవ్వాలని సీఎం ఆది శ్రీనివాస్‌కు సూచించినట్లు తెలిపారు.

## కలిసికట్టుగా ఉంటే విజయం సొంతం

- కార్యకర్తలే పార్టీకి బలం
- వేములవాడ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు
- కోనరావుపేటలో వనభోజనాలకు హాజరు



కోనరావుపేటలోని సమావేశంలో మాట్లాడుతున్న చల్మెడ లక్ష్మీనరసింహారావు

కోనరావుపేట, సెప్టెంబర్ 22: స్థానిక ఎన్నికలో అందరూ కలిసికట్టుగా పనిచేస్తే విజయం మన సొంతమేనని వేములవాడ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో వన భోజనాల కార్యక్రమాన్ని నిర్వహించగా హాజరై మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు ఇప్పటికే విముఖత వచ్చిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో ఆ పార్టీ విఫలమైందన్నారు. ప్రజలందరూ కాంగ్రెస్ మోసాలను గుర్తిస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలంతా బలంగా నిలబడి పార్టీ అభ్యర్థులను గెలిపించాలని సూచించారు. ఎన్నికల్లో విజయం సాధించి బీఆర్‌ఎస్ బలం చూపించాలని కోరారు. అనంతరం పంటపొలాల మధ్య కార్యకర్తలు, నాయకులంతా కలిసి వనభోజనాలు నిర్వహించారు. ఇక్కడ సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, సింగిల్ విండోచైర్మన్లు సంకినేని రామ్మోహన్‌రావు, బండ నర్సయ్య, మాజీ ఎంపీపీ చంద్రయ్యగౌడ్, కార్యకర్తలున్నారు.

## రోడ్డుపై దుమ్ము, కంకరతో ప్రయాణికుల అవస్థలు



బోయినపల్లి: దుమ్మలేస్తున్న వెంకట్రావ్‌పల్లి రహదారి

బోయినపల్లి, సెప్టెంబర్ 22: కొదురుపాక-వెంకటావ్‌పల్లి రహదారి మధ్య వంతెన నిర్మాణం పూర్తికాగా బీటీ వేయాల్సి ఉంది. కాని కాంట్రాక్టర్ బీటీ వేయకపోవడంతో కంకర రహదారిపై దుమ్ములేస్తుండడం, కంకరతో ప్రయాణికులు అవస్థలు పడుతూ వెళ్తున్నారు. ఈ రహదారి గుండా కరీంనగర్ నుంచి సిరిసిల్ల పట్టణం, వేములవాడ రాజన్న ఆలయానికి నిత్యం వందలాది పైగా బస్సులు, ద్విచక్ర వాహనాలపై ప్రజలు ప్రయాణిస్తుంటారు. కాని కాంట్రాక్టర్ మాత్రం ఈ రహదారి నిర్మాణం పూర్తి చేయకపోవడంతో వాహనదారుల ఇబ్బందిపడుతున్నారు. ఇప్పటికైనా వెంటనే రహదారి నిర్మాణం పూర్తి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## పంచాయతీలో సర్పంచ్ కుర్చీ మాయం

- మరిమడ్లలో కార్యాలయం నుంచి ఎత్తుకెళ్లిన గుర్తుతెలియని వ్యక్తులు
- మూడు నెలలైనా పట్టించుకోని అధికారులు



మరిమడ్ల పంచాయతీ కార్యాలయం



కుర్చీలేక ఖాళీగా ఉన్న టేబుల్

కోనరావుపేట, సెప్టెంబర్ 22: గ్రామ పంచాయతీ కార్యాలయంలో నుంచి ఏకంగా సర్పంచ్ కుర్చీనే మాయం చేశారు. సర్పంచ్ పదవీ కాలం ముగిసిన తర్వాత గ్రామ పంచాయతీలో ఉండే కుర్చీ మూడు నెలలుగా కనబడడం లేదు. అయినా పట్టించుకునే అధికారులు కరువయ్యారు. కుర్చీ ఎవరు తీసుకెళ్లారనే విషయం గ్రామంలో చర్చనీయాంశమైంది. ఈ ఘటన కోనరావుపేట మండలంలోని మరిమడ్ల గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి, గత ఫిబ్రవరిలోనే సర్పంచ్ కాలం ముగియగా, అందులో ఉండాల్సిన కుర్చీ మాయమైంది. అయితే ఇప్పటివరకు కుర్చీ జాడ తెలియకపోయినా అధికారులు పట్టించుకోవడం లేదు. కుర్చీతోపాటు కార్యాలయంలో విలువైన డాక్యుమెంట్లు, ముద్రలు, విలువైన కాగితాలు, రిజిస్టర్లు, సామగ్రిపోతే కూడా అధికారులు పట్టించుకోరా అనే విషయం విమర్శలకు తావిస్తున్నది. గతంలో సర్పంచ్ కుర్చీ, ఉపసర్పంచ్ కుర్చీని గ్రామస్తులు విరాళంగా అందజేశారు. ఏది ఏమైనా గ్రామంలో సర్పంచ్ కుర్చీ ఎటుపోయింది, ఎలా మాయమైందనే చర్చ జోరుగా సాగుతోంది. ఇప్పటికైనా అధికారులు సర్పంచ్ కుర్చీ ఎవరు తీసుకెళ్లారో గుర్తించి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై గ్రామ పంచాయతీ కార్యదర్శి విజయ్‌ను వివరణ కోరగా, మూడు నెలలుగా కుర్చీ మాయమైందని, ఎవరు తీసుకువెళ్లారో గుర్తించి తిరిగి పంచాయతీలో ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## షార్ట్ సర్క్యూట్‌తో కాలనీలో విద్యుత్ అంతరాయం

సిరిసిల్ల టౌన్, సెప్టెంబర్ 22: సిరిసిల్ల పట్టణంలోని గణేశ్‌నగర్‌లో ఆదివారం షార్ట్ సర్క్యూట్‌తో విద్యుత్ పోల్ వద్ద మంటలు చెలరేగి విద్యుత్ సరఫరాలో అంతరాయం నెలకొంది. విద్యుత్ పోల్‌కు అమర్చిన సీసీ కెమెరాలకు సంబంధించిన వైర్లు సర్వీస్ వైర్లకు తగలడంతో షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు వ్యాప్తి చెందినట్లు స్థానికులు తెలిపారు. దీంతో కాలనీలో చాలా సమయం వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సమాచారం అం దు కున్న సెస్ సిబ్బంది అక్కడికి చేరుకుని మరమ్మతు పనులు చేసినట్లు తెలిపారు.